క్లుప్తంగా

రేపటి నుంచి ఆలయ 35వ వార్షిక వేడుకలు

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలోని శ్రీఅభయ ఆంజనేయస్వామి ఆలయం 35వ వార్షకోత్సవం 28 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్మాణకర్తలు మలిశెట్టి సాంబశివరావు (నామాలు), బాలాంజనేయులు ఆదివారం తెలిపారు. వర్ఘుల నాంచారయ్య బ్రహ్మత్వంలో 28న ఉత్సవం ఆరంభం అవుతందన్నారు. 31వ తేదీ వరకు నిత్యం పలువురు దంపతులచే ఆకుపూజ, భజన బృందాల నేతృత్వంలో హనుమాన్ చాలీసా పారాయణం, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయి. హనుమజ్జయంతిని సందర్భంగా శ్రీసువర్చలాంజనేయ కల్యాణం, మహా అన్నసంతర్పణతో ఉత్సవాలు ముగుస్తాయని చెప్పారు.

ప్రశాంతంగా జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష



పెడన: మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగిందని కళాశాల అడ్మిన్ పి.అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు జరిగిన పరీక్షకు 192 మందికి 182 మంది హాజరయ్యారని, పది మంది గైర్హాజరయ్యారని తెలిపారు. మధ్యాహ్నం సెషన్‌లో 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన పరీక్షకు 192 మందికిగాను 182 మంది హాజరయ్యారని, పది మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. ప్రశాంతంగా పరీక్ష జరిగిందని ఆయన తెలిపారు.

ఆర్థిక సాయం



కోడూరు: అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితురాలికి ప్రముఖ పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాసరావు ఆదివారం ఆర్థిక సహాయం అందించారు. మండలంలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన బెల్లంకొండ రత్నకుమారి ఇల్లు ఇటీవల అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. దీంతో విషయం తెలుసుకున్న శ్రీనివాసరావు రత్నకుమారిని పరామర్శించి, ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. రూ.10 వేల ఆర్థిక సహాయం, 25 కేజీల బియ్యాన్ని అందించారు.

గ్రంథాలయాల్లో విద్యార్థులకు శిక్షణ



అవనిగడ్డ: స్థానిక ప్రథమశ్రేణి గ్రంథాలయంలో విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠనం, డ్యాన్స్, పద్యాలు చెప్పించడం వంటి అంశాల్లో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయ అధికారి జె.ప్రభుదాస్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.స్నేహ, ఎం. ఉషారాణి, బి.శేషగిరిరావు శిక్షణ ఇచ్చారు.

31న హనుమాన్ శోభాయాత్ర

బంటుమిల్లి: హిందూ శోభాయాత్ర సంఘం (హెచ్ఎస్ఎస్), బంటుమిల్లి ఆధ్వర్యంలో ఈ నెల 31వ తేదీన బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో నిర్వహించనున్న శోభాయాత్ర (బైక్ ర్యాలీ)కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సంఘ నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్షికంగా నిర్వహిస్తున్న బైక్‌ర్యాలీని జూన్ ఒకటో తేదీన జరగనున్న హనుమాన్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థానిక పద్మావతి, గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద హనుమాన్ చాలీసా పారాయణ, శ్రీ రామనామ స్మరణ చేస్తూ కాషాయ జండాలను బైక్‌లకు కట్టేందుకు సిద్ధం చేశామన్నారు. బైక్‌ర్యాలీ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి ప్రారంభమై బంటుమిల్లి, కృత్తివెన్ను రెండు మండలాల్లోని పలు గ్రామాల మీదుగా ప్రయాణించి తిరిగి ఆలయం వద్దకు చేరుతుందన్నారు. ఈ ర్యాలీలో తాళ్లాయపాలెం శైవమహాపీఠం పీఠాధిపతులు శివస్వామి ముఖ్యఅతిథిగా పాల్గొంటున్నట్లు నిర్వాహకులు చెప్పారు.

కార్తికేయుని ఆలయంలో భక్తుల రద్దీ

మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయం ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో కోలాహలంగా మారింది. పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు క్యూలో తెల్లవారు జామునుంచే బారులు తీరారు. ఆలయ ప్రాంగణంలో ఎటు చూసినా భక్తులతో నిండిపోయింది. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్ల శాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు

ఓట్ల లెక్కింపు ఇలా..

- 216 బూత్‌లు..16 రౌండ్లలో లెక్కింపు
- పెడన నియోజకవర్గంలో ప్రతి మండలానికి నాలుగు రౌండ్లు
- ప్రతి రౌండుకు సుమారు గంటన్నర సమయం
- ముక్కొల్లుతో ప్రారంభం.. ఏటిమొండి బూత్‌తో లెక్కింపు పూర్తి



కృష్ణా విశ్వవిద్యాలయంలో ఓట్ల లెక్కింపు కేంద్రం

పెడన: సాధారణ ఎన్నికలు పూర్తయి లెక్కింపు ప్రక్రియ సమీపిస్తుండటంతో అందరిలోను ఉత్కంఠ నెలకొంది. జూన్ నాలుగో తేదీన లెక్కింపు ఉండటంతో ఆ లెక్కింపు ప్రక్రియకు సంబంధించి మచిలీపట్నం మండలం రుద్రవరంలోని కృష్ణా విశ్వవిద్యాలయంలో ఆ రోజు ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రారంభించనున్నారు.

ముందుగా పోస్టల్ బ్యాలెట్లు..

తొలుత పోస్టల్ బ్యాలెట్‌ను లెక్కించనున్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రత్యేకంగా అనుమతులు పొందిన వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు మెడికల్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్‌లతో పాటు పలు శాఖల ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరి ఓట్లు 1,650 ఉన్నాయి. వీటిని లెక్కించడానికి మూడు టేబుల్స్‌ను ఏర్పాటు చేశారు. తొలుత ఈ ఓట్లను లెక్కించి ఎవరికి ఎన్ని ఓట్లు వచ్చాయనే విషయాన్ని వెల్లడించనున్నారు.

పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు పూర్తయితేనే..

పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియ పూర్తయిన తరువాతే ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్లను లెక్కించనున్నారు. పెడన అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఈవీఎంలలో ఓట్లను లెక్కించడానికి 14 టేబుల్స్‌ను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో 216 బూత్‌లు ఉన్నాయి. ఒక టేబుల్ ఒక బూత్‌కు ఏర్పాటు చేశారు. 14 టేబుల్స్‌లలో 14 బూత్‌లకు సంబంధించిన ఈవీఎంలలోని ఓట్లను లెక్కిస్తారు. పెడన నియోజకవర్గంలో మొత్తం 216 బూత్‌లకు సంబంధించిన ఓట్లను 16 రౌండ్లు లెక్కించాలి. నియోజకవర్గంలో 1,67,564 ఓట్లు ఉండగా 1,48,413 ఓట్లు పోలయ్యాయి. ఇవి కాకుండా 1,650 పోస్టల్ బ్యాలెట్లు పోలయ్యాయి.

లెక్కింపు రోజున పోస్టల్ బ్యాలెట్ల తరలింపు

పెడన ఈఆర్వో కార్యాలయంలోని స్ట్రాంగ్ రూం వద్ద భద్రపరిచిన పోస్టల్ బ్యాలెట్లను లెక్కింపు రోజు ఉదయం ఐదు గంటలకు ఆయా పార్టీలకు చెందిన అభ్యర్థులు లేదా వారి ఏజెంట్ల సమక్షంలో కృష్ణా యూనివర్శిటీకి తరలిస్తారు. ఈ ప్రక్రియ వీడియో తీయిస్తారు.

ఇవి తీసుకురాకూడదు..

లెక్కింపు కేంద్రానికి అనుమతులున్న వారు ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్ ఫోన్లు తీసుకురాకూడదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. అదే విధంగా లెక్కింపు ఏజెంట్లు, అభ్యర్థులు తప్పనిసరిగా ఎన్నికల అధికారి నుంచి పాస్‌లు పొందాల్సి ఉంటుంది. ఏజెంట్లు, అభ్యర్థులు వారి వాహనాలకు కూడా పాస్‌లు తీసుకుని లోపలకు రావాల్సి ఉంటుంది.

గూడూరు మండలం ముక్కొల్లుతో ప్రారంభం..



ఓట్ల లెక్కింపునకు చేసిన ఏర్పాట్లు

ఈవీఎంల ద్వారా లెక్కింపు ప్రక్రియ గూడూరు మండలం ముక్కొల్లుతో మొదటి రౌండ్ ప్రారంభమవుతుంది. ఈ రౌండు సుమారు ఉదయం 9 గంటల తరువాతే ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. మొదటి నాలుగు రౌండ్లలో గూడూరు మండలం ఓట్ల లెక్కింపు పూర్తవుతుంది. అనంతరం పెడన మండలంలో 44 బూత్‌లు ఉన్నాయి. ఐదో రౌండ్ నుంచి పెడన మండలం లెక్కింపు మొదలవుతుంది. మొత్తం 5, 6, 7 రౌండ్లతో పాటు 8వ రౌండులోని రెండు టేబుల్స్‌తో పెడన మండలం ఓట్ల లెక్కింపు పూర్తవుతుంది. 8వ రౌండ్‌లో మూడో టేబుల్ నుంచి పెడన పట్టణం ఓట్ల లెక్కింపు ప్రారంభమై 9వ రౌండ్ 13వ టేబుల్‌తో పూర్తవుతుంది. 9వ రౌండ్ 14వ టేబుల్ నుంచి బంటుమిల్లి 13వ రౌండ్ రెండో టేబుల్స్‌తో బంటుమిల్లి మండలం ఓట్ల లెక్కింపు పూర్తవుతుంది. అనంతరం 13వ రౌండ్‌లో మూడో టేబుల్ నుంచి కృత్తివెన్ను మండలం ఓట్ల లెక్కింపు ప్రారంభమై 16వ రౌండ్ టేబుల్ ఆరో టేబుల్‌తో పూర్తవుతుంది. చివరగా కృత్తివెన్ను మండలం ఏటిమొండితో లెక్కింపు పూర్తవుతుంది. పోస్టల్ బ్యాలెట్‌తో కలిపి మొత్తం ఎవరికి ఎన్ని ఓట్లు వచ్చాయనే విషయాన్ని పెడన ఎన్నికల అధికారి అధికారికంగా ప్రకటిస్తారు.

నిబంధనలు పాటించాలి..



లెక్కింపులో ప్రతి రౌండుకు గంట లేదా గంటన్నర సమయం పడుతుంది. లెక్కింపు కేంద్రానికి వచ్చే అభ్యర్థులు, ఏజంట్లు ఎన్నికల నియమనిబంధనలను పాటించాలి. ముందస్తు అనుమతి తీసుకున్న వారినే అనుమతిస్తాం. అభ్యర్థులు తమ వెంట లెక్కింపు కేంద్రంలోని ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్ ఫోన్లు తీసుకురాకూడదు. ఏజెంట్లు మత్తుపానీయాలు, పదార్థాలు సేవించి రాకూడదు. లెక్కింపు పూర్తయిన తరువాత ఎదుటి పార్టీ వారిని రెచ్చగొట్టేలా ప్రవర్తించకూడదు. అలా చేస్తే కఠిన చర్యలు తీసుకునేందుకు ఎన్నికల అధికారికి పూర్తి అధికారాలున్నాయి. పోలింగ్ ఎంత ప్రశాంతంగా జరిగిందో లెక్కింపు కూడా అంతే ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలి.

–పి.వెంకటరమణ, ఎన్నికల అధికారి, పెడన నియోజకవర్గం

వృత్తి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం



సమావేశంలో మాట్లాడుతున్న ఉస్మాన్‌బాషా

పెడన: సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శివార్జున నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో పేద మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్, ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం వర్క్– శారీ పెయింటింగ్ శిక్షణ తరగతులు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు సహాయ ఫౌండేషన్ అధ్యక్షుడు ఉస్మాన్ భాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సహాయ కేంద్రం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. జూన్ ఒకటో తేదీ నుంచి ప్రారంభమయ్యే ఈ శిక్షణ తరగతులకు అర్హులైన పేద మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. రెండు నెలల శిక్షణకు, 7వ బ్యాచ్‌కు దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. శిక్షణ తరగతులు అనంతరం పరీక్ష నిర్వహించి సర్టిఫికెట్లు అందిస్తామని పేర్కొన్నారు. ఈ శిక్షణ తరగతులకు హాజరయ్యి శిక్షణ పొందాలనుకునే వారు పెడన భట్లజ్ఞాన కోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న రాధా కృష్ణభవన్‌లో గల శివార్జున నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట మధ్య ఆసక్తి ఉన్న వారు ఆధార్ జీరాక్స్ వెంట తీసుకుని సంప్రదించాలన్నారు. వివరాలకు 98666 13913, 99664 19220, 79933 44708లలో సంప్రదించాల్సిందిగా సూచించారు. ఈ సమావేశంలో మట్టా రాధాకృష్ణమూర్తి, కాగిత సాంబశివరావు, కొండవీటి సుధారాణి, ట్రైనర్స్ రామినేని దుర్గ, వాసా భవాని తదితరులు పాల్గొన్నారు.

గణిత అధ్యాపకుడు రమేష్‌కు డాక్టరేట్



ఘంటసాల: పామర్రు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గణిత అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న ఘంటసాల గ్రామానికి చెందిన వక్కలగడ్డ రమేష్‌కు అమెరికా కేంద్రంగా పని చేస్తున్న గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ చెన్నై శాఖ గౌరవ డాక్టరేట్ పురస్కారం అందజేసింది. శనివారం రాత్రి చెన్నై భారతీయ విద్యా భవన్‌లో గౌరవ డాక్టరేట్ పురస్కారం అందించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత రమేష్ మాట్లాడుతూ వివిధ రంగాలో ప్రతిభ కనబరిచిన ప్రముఖులకు చెన్నైలోని గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రధానం చేసిందన్నారు. రెండు దశాబ్దాలుగా హైస్కూల్, కళాశాల, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ చదివే పేద విద్యార్థులకు ఆర్థికంగా చేయూతనిస్తూ వారి విద్యాభివృద్ధికి చేసిన సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్ ఇచ్చినట్లు చెప్పారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ



మోపిదేవిలో మజ్జిగ పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

మోపిదేవి: మండల ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో వేసవిలో చల్లని మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమని ప్రముఖ పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాసరావు అన్నారు. మోపిదేవి ప్రధాన గుడి సెంటర్‌లో ఎస్ఆర్‌వైఎస్‌పీ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మోపిదేవి బ్రాంచి నేతృత్వంలో విక్కుర్తి శ్రీనివాసరావు సహకారంతో ఆదివారం మజ్జిగ పంపిణీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానానికి వచ్చిన భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. విశ్రాంతి ప్రిన్సిపాల్, పూర్వ విద్యార్థుల సంఘం గౌరవ అధ్యక్షుడు తగిరిశ సాంబశివరావు, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొండపల్లి శ్రీనివాసరావు, సంఘం సభ్యులు, పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

డ్రైయిన్ల మరమ్మతులు చేపట్టాలి

బంటుమిల్లి: వర్షాకాలంలో పంటలు నీటిపాలు కాకుండా వేసవిలోనే ముందస్తుగా మైనర్, మీడియం డ్రెయిన్ల మరమ్మతులు చేయాలని ఏపీ రైతు సంఘం డిమాండ్ చేసింది. మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఉన్న మైనర్ డ్రెయిన్లను ఆదివారం రైతు సంఘం జిల్లా కార్యదర్శి గోరిశెట్టి నాగేశ్వరరావు స్థానిక రైతులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా గత సంవత్సరం అధిక వర్షాలకు పంటలు దెబ్బతిన్న పలువురు రైతులు తమ సమస్యలను సంఘ దృష్టికి తెచ్చారు. మల్లపరాజుగూడెం, పెందుర్రు, చినతుమ్మిడి, అర్తమూరు తదితర గ్రామాల్లోని మైనర్ డ్రెయిన్లలో పేరుకుపోయిన తూడు, జమ్ము, గుర్రపుడెక్క తదితర అడ్డంకులు తొలగించేందుకు డ్రెయినేజీ అధికారులు యుద్ధ ప్రాతిపదికన చేయాలని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. రైతులతోపాటు పలు గ్రామాల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థినుల ర్యాలీ



మానవహారంగా విద్యార్థినులు

ఘంటసాల: వ్యవసాయ విద్య ద్వారా విద్యార్థులకు ఉన్నత భవిష్యత్తు ఉంటుందని బాపట్ల వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారిణి డాక్టర్ అపర్ణ అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విద్యాలయం బాపట్లకు చెందిన వ్యవసాయ కళాశాల విద్యార్థినులు గ్రామీణ వ్యవసాయ పని అనుభవం కోసం ఘంటసాల గ్రామంలో ఉంటున్నారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ క్యాంపులో భాగంగా ఘంటసాల గ్రామంలో ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేసి వ్యవసాయ విద్యపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం తాడేపల్లిలోని వృద్ధాశ్రమంలో నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ విజయ్ కుమార్, విద్యార్థినులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సబ్సిడీ పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం

నాగాయలంక: మండలంలో రైతులకు సబ్సిడీపై పంపిణీ చేసేందుకు పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి ఏ సంజీవరావు ఆదివారం చెప్పారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో 50 శాతం సబ్సిడీపై విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, సోమవారం నుంచి పంపిణీ చేస్తామని వివరించారు. వ్యవసాయశాఖ ద్వారా రైతులకు సమృద్ధిగా 20 క్వింటాళ్ల జీలుగ, 94 క్వింటాళ్లు పిల్లిపెసర విత్తనాలు ఆర్బీకేల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. విత్తనాలు కావల్సిన రైతులు ఆధార్ కార్డు, భూ వివరాలతో ఆర్బీకేల్లోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని తెలిపారు. జీలుగ విత్తనాలు కేజీ సబ్సిడీతో ధర రూ.44 (అసలు ధర రూ.88)లకు, పిల్లిపెసర సబ్సిడీపై రూ.67 (అసలు ధర రూ.134)విక్రయిస్తామన్నారు. పచ్చిరొట్ట ఎరువులు వాడకంతో భూసారం మెరుగు పడటంతో పాటు నేల గుల్లగా మారి నీరు ఇంకే గుణం పెరిగి నేలలో ఉపయోగ సూక్ష్మజీవులు వృద్ధి జరుగుతుందన్నారు. పచ్చిరొట్టకు చౌడు ను విరిచే లక్షణం ఉన్న కారణంగా నాగాయలంక మండలంలోని తీరప్రాంత గ్రామాల పొలాలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు.

ఇనుప బీరువా సమర్పణ

మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారికి తెనాలి వాస్తవ్యులు శ్రీసాయి వెంకయ్య శిష్యబృందం ఇనుప బీరువా అందించారు. ఆదివారం ఉదయం శిష్యబృందం వారు స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఈ బీరువాను ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణకు అందజేశారు. భక్తితో సమర్పించిన దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

క్రాకర్స్ షాపుల్లో తనిఖీ



క్రాకర్స్ షాపులో తనిఖీ చేస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

పెదప్రోలు(మోపిదేవి): ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలను దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్రాకర్స్ (బాణాసంచా)షాపులపై ఆదివారం ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. పెదప్రోలులో నిర్వహిస్తున్న క్రాకర్స్ గోడౌన్‌లో తనిఖీ నిర్వహించారు. క్రాకర్స్ తయారు చేయడం, అమ్మకాలు, రవాణా వంటివి ఉండరాదని యజమానులకు సూచించారు. పట్టుబడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాయని హెచ్చరించారు. రెవెన్యూ అధికారులు, ఫైర్ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

పండుగలు మానవ సంబంధాలకు ప్రతీకలు

పెడన వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాము



మూట్లాం గ్రామంలో గ్రామదేవతకు నమస్కరిస్తున్న ఉప్పాల రాము

కృత్తివెన్ను: పండుగలు మానవ సంబంధాలకు ప్రతీకలని పెడన నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రమేష్ (రాము) అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని ఇంతేరు, మాట్లాం గ్రామాల్లో జరుగుతున్న మోకమ్మ, మహాలక్ష్మమ్మ, మొగదారమ్మ, మారెమ్మ, వెంకమ్మ, పోతురాజు, గ్రామ దేవతల జాతర మహోత్సవాల్లో పాల్గొన్నారు. ముందుగా అమ్మవారి ప్రతిమలకు ప్రత్యేక పూజలు చేసిన రాము జాతర విశేషాలను గ్రామస్తుల నుంచి తెలుసుకున్నారు. ప్రశాంతమైన వాతావరణంలో శాంతియుతంగా జాతరలు జరుపుకోవాలని అప్పుడే గ్రామ ఐక్యత మరింత వర్ధిల్లి భావితరాలకు మంచి సంస్కృతి అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఆర్టీసీ కృష్ణా జోనల్ చైర్మన్ పిన్నెంటి మహేష్, ఇంతేరు సర్పంచ్, ఎంపీటీసీలు మోకమ్మ, వడ్డికాసులు తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



విశ్రాంత హెచ్ఎం లింగం మోజెస్‌ను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు



వై.చందనబాబు దంపతులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

కోనేరుసెంటర్: మచిలీపట్నం హైని హైస్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో 2004–2005 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సుమారు 20 సంవత్సరాల అనంతరం ఒకే చోట కలుసుకున్నారు. ఈ ఆత్మీయ కలయికలో ఆనాటి ఆనంద సంఘటనలను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. వారంతా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆనాడు తరగతి గదుల్లో చేసిన అల్లర్లు, విద్యార్థుల మధ్య జరిగిన మధుర సంఘటనలను గుర్తు చేసుకుంటూ సరదాగా గడిపారు. వారి ప్రస్తుత పరిస్థితులను ఒకరికొకరు చెప్పుకుని సంతోషాలతో పాటు సాధక బాధలను పంచుకున్నారు. ఆనాడు తరగతి గదుల్లో తమకు విద్యాబోధన చేసిన విశ్రాంత హెచ్ఎంలు లింగం మోజెస్, వైట్ గ్లోరియా, ముంతాజ్ బేగం, స్నేహలత తదితరులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు డి.సురేష్, పి.ఎస్.పి.కృష్ణ, మధుబాబు, రాజేష్, చంద్రిక, మౌనిక, తిలోత్తమ, వాణి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రధానోపాధ్యాయుడు రవుల్ వైకో వెలివెల, ఉపాధ్యాయులు వై.గాబ్రియేల్, మైఖేల్, చిన్న వెంకయ్య, గిడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంకటావలో..

గూడూరు: కంకటావ జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. 1997–98 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులంతా కలిసి చిన్ననాటి మధుర జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. 26 సంవత్సరాల తర్వాత కలుసుకున్న స్నేహితులు ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించి వారి ఆశీసులు అందుకున్నారు. కార్యక్రమంలో ఆనాటి గురువులు వై.చందనబాబు, వి.వి.సుబ్బయ్య మాస్టార్లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.

ముగిసిన స్వామివారి కల్యాణ బ్రహ్మోత్సవాలు



శ్రీకాకుళేశ్వరస్వామి వారికి నిర్వహిస్తున్న పుష్పయాగోత్సవం

శ్రీకాకుళం(ఘంటసాల): మండలంలోని శ్రీకాకుళం గ్రామంలో శ్రీరాజ్యలక్ష్మి, భోగలక్ష్మి సమేత శ్రీకాకుళేశ్వర స్వామి వారి కల్యాణ బ్రహోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఆలయ సహాయ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో పండితులు శ్రీకాకుళేశ్వరస్వామి, అమ్మవార్లను శనివారం రాత్రి శేష వాహనంపై గ్రామోత్సవం, ద్వాదశ ప్రదక్షిణలు నిర్వహించారు. స్వామి వార్లకు శ్రీ పుష్పయాగోత్సవములు చేసి పవళింపు సేవతో కల్యాణ బ్రహోత్సవాలు ముగించారు. ఆలయ సిబ్బంది, భక్తులు ఏసీ చక్రధరరావు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం



దగ్ధమైన పూరింటి వద్ద బాధితులు

కొక్కిలిగడ్డ(మోపిదేవి): మండల పరిధిలోని కొక్కిలిగడ్డలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిల్లు పూర్తిగా కాలిపోయింది. అవనిగడ్డ అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. అధికారి పీఎస్‌బీవీ ప్రసాదరావు మాట్లాడుతూ ఎన్టీఆర్ కాలనీకి చెందిన రాచూరి లంకేశ్వరావు పూరింటిలో వంటగ్యాస్ లీకయి మంటలు వ్యాపించినట్లు తెలిపారు. ఈ మంటల్లో వస్తువులన్నీ కాలిబూడి దయ్యాయని సుమారు రూ.80 వేలు నష్టం వాటిల్లి ఉంటుందన్నారు. చుట్టు పక్కల మంటలు వ్యాపించకుండా సిబ్బంది మంటలను అదుపు చేసినట్లు తెలిపారు.

కోలాట గురువు గంగాధర్ మృతి

ఘంటసాల: ప్రముఖ కోలాటం గురువు తూములూరి గంగాధర్ (88) ఆదివారం మృతి చెందారు. ఘంటసాల గ్రామానికి చెందిన గంగాధర్ శ్రీ వెంకటేశ్వర బాలభక్త భజన సమాజం కోలాటం గురువుగా దేవుడు చేసిన మనుషులు తెలుగు చిత్రంతో పాటు టక్కర్ అనే హిందీ చిత్రంలో కోలాట ప్రదర్శన చేశారు. భక్తి పాటలు, జానపద పాటలతో కోలాట ప్రదర్శనలు చేసి పలువురి ప్రశంసలు అందుకున్నారు. రేడియో, టీవీ ఆర్టిస్టు కూడా పని చేశారు. ఘంటసాల రజకపేటలో రామాలయం నిర్మాణంలో కీలపాత్ర పోషించారు. గంగాధర్ భార్య జనవరిలో మృతి చెందారు. వీరికి ఇరువురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. గంగాధర్ మరణవార్త తెలుసున్న ఘంటసాల మార్కెట్ కమిటీ చైర్మన్ వేమూరి వెంకట్రావు, సచివాలయాల మండల కన్వీనర్ వేమూరి ప్రవీణ్, మాజీ ఉప సర్పంచ్ గొర్రెపాటి గోపాలకృష్ణ, గొర్రెపాటి జనార్ధన్‌లతో పాటు అభిమానులు, శిష్యులు, కళాకారులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

సంక్షిప్త వార్తలు

■ భక్తిశ్రద్ధలతో స్వామివారి పవళింపు సేవ

కొక్కిలిగడ్డ(మోపిదేవి): మండలంలోని కొక్కిలిగడ్డలో శ్రీ మల్లేశ్వరస్వామివారి పవళింపు సేవ వేదపండితులచే శాస్త్రోక్తంగా నిర్వహించారు. గ్రామంలో శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు వేదపండితులు గుండెపూడి నాగరాజ శేఖర్ శర్మ వైభవంగా నిర్వహించారు. చివరిరోజు ఆదివారం తెల్లవారుజామున ప్రత్యేక వాహనంపై ఊరేగింపుగా సమీపంలోని కృష్ణానది వెళ్లి శ్రీ స్వామివారితో అవబృధస్నానం ఆచరింపచేశారు. సాయంత్రం ధ్వజావరోహణం, మూకబలి, ద్వాదశ ప్రదక్షిణాలు, అనంతరం వేదపండితులచే పవళింపు సేవ నిర్వహించారు. భక్తితో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

■ డ్రెయినేజీలో పూడిక తీత

చల్లపల్లి: గ్రామంలోని పెద్ద కళ్లేపల్లి రోడ్డులో కొన్ని సంవత్సరాల నుంచి అత్యంత సమస్యాత్మకంగా ఉన్న డ్రెయినేజీ సమస్యకు మోక్షం లభించింది. ఆదివారం గ్రామ పంచాయతీ నిధులు రూ.2.30 లక్షల అంచనా వ్యయంతో పెద్దకళ్లేపల్లి రోడ్డు డ్రెయినేజీ ఆక్రమణల తొలగింపు, పూడికతీత పనులను ప్రారంభించారు. గ్రామ సర్పంచి పైడిపాముల కృష్ణకుమారి, పంచాయతీ ఈఓ పీవీ మాధవేంద్రరావు పర్యవేక్షణలో పనులు చేపట్టారు. దుకాణాల ముందు చప్టాల కింద తూము కల్వర్టులు పూడిపోయి మురుగు, వర్షపు నీరు ప్రవహించక నెలకొంటున్న సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు.

■ ఎన్‌సీసీ కేడెట్ల శిక్షణ పూర్తి

గూడూరు: గుడివాడ ఏఎస్ఆర్ కళాశాలలో నిర్వహించిన ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరంలో గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 35 మంది కేడెట్లు శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్నారని హెచ్ఎం డి.పుష్పలత తెలిపారు. ఈనెల 17 నుంచి 26 వరకు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో జూనియర్ వింగ్ నుంచి 24 మంది, జూనియర్ డివిజన్ విభాగాల నుంచి 11 మంది కేడెట్లు పాల్గొన్నారు. శిక్షణ కాలంలో వీరు మాప్ రీడింగ్, ఫైరింగ్, ఫీల్డ్ క్రాఫ్ట్, బాటిల్ క్రాఫ్ట్, ఫస్ట్ ఎయిడ్, మాక్ డ్రిల్, జనరల్ నాలెడ్జ్, సోసల్ ఎవేర్‌నెస్, కల్చరల్ ప్రోగ్రామ్స్‌పై శిక్షణ పొందారు. తద్వారా కేడెట్లలో లీడర్‌షిప్ క్వాలిటీస్ పెంపొందించడానికి శిక్షణ తరగతులు దోహదపడుతాయన్నారు.

■ వర్తక సంఘానికి నూతన కార్యవర్గం

చల్లపల్లి: చల్లపల్లి వర్తక సంఘం నూతన అధ్యక్షుడిగా నూజెళ్ల వెంకటేశ్వరరావు (బాబు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం సాయంత్రం స్థానిక వర్తక సంఘ కార్యాలయంలో సంఘ నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘ పెద్దలు వరదా తాండవకృష్ణ, కొల్లిపర మధు పర్యవేక్షణలో ఎన్నిక నిర్వహించగా, నూతన అధ్యక్షుడిగా నూజెళ్ల బాబు, ఉపాధ్యక్షుడిగా నంబూరు విజయ్‌కుమార్ ఎన్నికయ్యారు. కార్యదర్శిగా వరదా రాజశేఖర్, సహాయ కార్యదర్శిగా ఉరిమి శ్రీనివాసరావు, కోశాధికారిగా మలిశెట్టి చెంచురాములు, కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

■ చక్కని దస్తూరీతో ఎక్కువ మార్కులు

గూడూరు: చక్కని దస్తూరీతో విద్యార్థులు మంచి మార్కులు సాధించవచ్చని గూడూరు శాఖా గ్రంథాలయ అధికారి వై.శ్రీనివాసరావు అన్నారు. వేసవి సెలవులను పురస్కరించుకుని జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గూడూరులోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు చక్కని దస్తూరీ కోసం కాపీ రైటింగ్ ప్రాక్టీస్ చేయించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు ఎంత బాగా చదివినా పరీక్షల్లో పేపర్లు దిద్దే ఉపాధ్యాయులకు అర్థమయ్యేలా ఉంటేనే మంచి మార్కులు వస్తాయన్నారు. అందుకు చిన్న తనం నుంచే మంచి దస్తూరీలో రాయడం నేర్చుకోవాలని సూచించారు.